సాక్షి
ప్రకాశం

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



భళారే చిత్రం

ముగ్గురు కంభం వాసులు చిత్రలేఖనంలో రాణి స్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకున్నారు. - 8లో..



దివ్యాంగులకు అండగా జగనన్న

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా దివ్యాంగులకు అండగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్య క్షుడు బందెల కిరణ్‌రాజ్ కొనియాడారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది

న్యూస్‌రీల్

7లోగా పీడీలు, పీఈటీలు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: జిల్లాలో స్కూల్ గేమ్స్ సెక్రటరీగా పనిచేసేందుకు సీనియార్టీ, సుముఖత కలిగిన మహిళా ఫిజికల్ ఎడ్యుకేషన్ పీడీలు, పీఈటీలు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని డీఈవో బి.విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం అత్యధిక మహిళా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఉన్న జిల్లాల్లో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలుగా సీనియార్టీ, సుముఖత ఆధారంగా ఎస్‌జీఎఫ్ సెక్రటరీని నియమించాలని వచ్చిన ఆదేశాల మేరకు ఈ ప్రకటన జారీ చేయడం జరిగిందన్నారు.

ఢిల్లీలో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ఢిల్లీలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయకృష్ణన్ దంపతులు

ఒంగోలు అర్బన్: కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి అవార్డుల కోసం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆయన సతీమణి, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌తో కలిసి ఢిల్లీ వెళ్లి స్క్రీనింగ్ కమిటీ వద్ద గురువారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, వినూత్న ఆలోచనలతో చేసే పనులపై ఢిల్లీలోని సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో స్క్రీనింగ్ కమిటీ ముందు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడంతో పాటు ఉత్తమ భవిష్యత్తుకు వారికి అవసరమైన సూచనలు చేయడం, పల్లె నిద్ర వంటి కార్యక్రమాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించాలి

ఒంగోలు అర్బన్: అన్ని పాఠశాలల్లో చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయభాస్కర్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక స్పందన భవనంలో మార్కాపురం డివిజన్‌లోని హెచ్‌ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు పాఠశాలల్లో లెసెన్ ప్లాన్, టీచర్స్ డైరీలను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలను పరిశీలించి సవరణలు చేసి తగిన సూచనలు చేయాలన్నారు. బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. పాఠశాలల్లో ఉన్న ఫిర్యాదుల పెట్టెలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నాడు–నేడు నిధులను వెంటనే నిబంధనల మేరకు ఖర్చుచేయాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వరరావు, ఏఎస్‌వో కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విదేశీ విద్యాదీవెన నిధులు విడుదల

ఒంగోలు: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం తొలి విడత నిధులను శుక్రవారం విడుదల చేయనున్నట్టు సాంఘిక సంక్షేమశాఖ నోడల్ అధికారి ఎస్.లక్ష్మానాయక్ తెలిపారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారికి మొత్తం రూ.1,35,87,300 చెల్లించాల్సి ఉంది. అందులో తొలి విడతగా రూ.38,93,250 అందజేయనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా తొలివిడత ఫీజును తల్లుల బ్యాంకు ఖాతాలలో జమచేస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని లక్ష్మానాయక్ కోరారు.

బెంగళూరు వెళ్లి పెన్షన్ అందజేత

గిద్దలూరు రూరల్: స్థానిక 3వ వార్డు సచివాలయం పరిధిలోని కిడ్నీ డయాలసిస్ బాధితుడు బాదం చంద్రశేఖర్ అనారోగ్యానికి గురై బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ గందె హులేషికిషోర్ గురువారం బెంగళూరు వెళ్లి పెన్షన్ నగదు రూ.10 వేలు అందజేశాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్‌ను వెతుక్కుంటూ వెళ్లి పెన్షన్ అందజేయడంతో వలంటీర్ సేవలను కొనియాడారు.

నిమ్మ ధర కేక

నిమ్మ రైతు పంట పండింది. నిన్న మొన్నటి వరకూ సరైన ధరల్లేక దిగాలుగా ఉన్న రైతుకు మార్కెట్ ధరలు మరింత ఉత్సాహాన్నిచ్చాయి. వారం రోజుల కిందట వరకూ కిలో రూ.10 నుంచి రూ.15 పలికింది. నేడు మార్కెట్లో ధరలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం రూ.25 నుంచి రూ.30 వరకూ పలుకుతున్నాయి. నాణ్యత పెరగడంతో పాటు ఉత్పత్తి తగ్గడంతో నిమ్మకు డిమాండ్ పెరిగింది. రానున్న రోజుల్లో రేటు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

- కనిగిరి టూ ఢిల్లీ, ముంబై
- ఉత్సాహంలో రైతు
- పండు కాయ కేజీ రూ.15
- పచ్చికాయ రూ.25 నుంచి రూ.30
- మార్చిలోపు మరింత పెరిగే అవకాశం
- జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగు



ధర పెరిగిన పచ్చి నిమ్మకాయలివే...

హనుమంతునిపాడు/కనిగిరి రూరల్: జిల్లాలోనే అత్యధికంగా నిమ్మతోటల సాగు కనిగిరి నియోజకవర్గంలోనే జరుగుతోంది. వ్యాపారులు, రైతుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాల వరకు నిమ్మ సాగవుతోంది. ఒక్క కనిగిరి నియోజకవర్గంలోనే సుమారు 32 వేల ఎకరాల వరకు సాగు ఉన్నట్లు అంచనా. అందులో హెచ్‌ఎం పాడు మండలంలో 20 వేల ఎకరాల వరకు ఉంటుంది. ఆ తర్వాత సీఎస్ పురం, వెలిగండ్ల మండలాల్లో దాదాపు 12 వేల ఎకరాల వరకు సాగవుతోంది. యర్రగొండపాలెం, చీమకుర్తి, దర్శి, చినారికట్ల, కొణిజేడు తదితర ప్రాంతాల్లో నిమ్మ సాగు చేస్తున్నట్టు సమాచారం. టీడీపీ హయంలో వర్షాలు లేక చాలా వరకు నిమ్మ తోటలను రైతులు నరికేశారు. వర్షాలు పడక, బోర్ల కింద సాగుచేసిన పంటలకు పెట్టుబడులు పెరిగి వాటికి గిట్టుబాటు ధరల్లేక అల్లాడారు. చాలా మంది తోటలపైనే కాయలు వదిలేశారు. అయినప్పటికీ జిల్లాలో హెచ్‌ఎం పాడులోనే అత్యధికంగా నిమ్మ సాగు ఉంది. ఈ మండలంలోని ఎర్రనేలలో పండే నిమ్మకు ఎక్కువ శాతం గిరాకీ ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం కలిసి వచ్చిన కాలం...

ప్రస్తుత కాలంలో వర్షాలు పడి భూగర్భ జలాలు పెరగడంతో రైతులు మళ్లీ నిమ్మతోటల సాగుకు ముందుకొచ్చారు. ఫలితంగా లేత తోటలు అధికంగా ఉండి ముదురు తోటలు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో దిగుబడి రోజుకు నాలుగు, ఐదు లారీలు రావాల్సి ఉండగా, ప్రస్తుతం రెండు లారీల లోడు మాత్రమే మార్కెట్‌కు వస్తోంది. దీంతో సీజన్ ప్రారంభం కావడం, డిమాండ్‌కు తగిన సరుకు అందుబాటులో లేకపోవడంతో ఒక్కసారిగా రూ.10 నుంచి రూ.15 వరకు ధర పెరిగింది. గతంలో ఆటోలు, కూలీల ఖర్చులకుపోను నామ్‌కే వాస్తే ఆదాయంతో దిగాలు చెందుతున్న రైతన్నకు ఒక్కసారి ధరలు పెరగడంతో వారి మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో నిమ్మ ధర రూ.25 నుంచి రూ.30 మధ్య పలుకుతోంది. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉంది. వేసవిలో రూ.50కి చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అంటున్నారు.

కనిగిరి టూ ఢిల్లీ, ముంబై, బెంగళూరు...

కనిగిరి పట్టణంలో సుమారు 6 వరకు హోల్‌సేల్ వ్యాపార దుకాణాలున్నాయి. సీజన్‌లో రోజుకు సుమారు 5 నుంచి 6 లారీలు 50 వేల టన్నుల నిమ్మకాయలను చెన్నై, హైదరాబాద్, జైపూర్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఎక్కువగా చెన్నై, బెంగళూరు మార్కెట్‌కు వెళ్తాయి. అయితే ప్రస్తుతం 2 లారీల నిమ్మకాయలు మాత్రమే మార్కెట్‌కు వస్తున్నాయి.

ప్రస్తుతం కేజీ రూ.30 వరకు తీసుకుంటున్నాం



వారం రోజుల వరకు కూడా పండు కాయ కేజీ రూ.10కి, పచ్చి కాయ రూ.15కి కొనేవాళ్లం. ప్రస్తుతం కాయ ఎగుమతికి డిమాండ్ రావడం, సరుకు దిగుబడి, ఉత్పత్తి తగ్గడంతో ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం పండు కాయ రూ.15కు, పచ్చికాయ రూ.28 నుంచి రూ.30 వరకూ కొనుగోలు చేస్తున్నాం. ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది. మార్చి నెలాఖరునాటికి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

– నర్సయ్య, హోల్ సేల్ వ్యాపారి

పేదరికం లేని సమాజమే
జగనన్న లక్ష్యం



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

పెద్దదోర్నాల: పేదరికం లేని సమాజమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీఎం జగన్ పరిపాలన చాలా బాగుందని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్ని వసతులతో పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తోందని వివరించారు. రాబోయే రోజుల్లో అనేక కంపెనీల పెట్టుబడులతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పేదరికాన్ని రూపుమాపేందుకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి పేదవాడు ఆర్థికంగా బలోపేతం అయ్యాడన్నారు. ప్రతి ఇంట్లోనూ చదువుకుంటున్న ప్రతి బిడ్డకు అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ప్రజల ఇంటి వద్దకే అందించడం హర్షనీయమని ఆయన కొనియాడారు. సంక్షేమ పాలనకు ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, డీఎల్‌డీవో సాయికుమార్, తహసీల్దార్ వేణుగోపాలరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, మండల నాయకులు గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, యక్కంటి మల్లారెడ్డి, యక్కంటి లింగారెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్, దూదేకుల రసూల్, షేక్ షరీఫ్, బాబూరావు, ఎస్సై శ్రీనివాసరావు, ఎంఈవో మస్తాన్‌నాయక్, ఏపీఎం పోలయ్య, ఏపీవో అన్నపూర్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు.. టంగుటూరి



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్

మార్కాపురం: టంగుటూరి ప్రకాశం పంతులు మహనీయుడని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూపు సురేష్ అన్నారు. జిల్లా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురంలోని తన నివాసంలో గురువారం టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాటాలు చేసి బ్రిటీష్ వారి తుపాకికి ఎదురెళ్లిన గొప్ప ధైర్యశాలి ప్రకాశం పంతులని అన్నారు. ఆయన స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో ఉమారాణి, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు దారివేముల బాబి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చందన, సిబ్బంది ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈవోఆర్డీ రాంమోహన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులే స్ఫూర్తి

- వారిని ఆదర్శంగా తీసుకుని జిల్లాను అభివృద్ధి చేసుకుందాం
- జిల్లా అవతరణ దినోత్సవంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఎందరో మహనీయులు ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని అన్ని రకాలుగా జిల్లాను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. జిల్లా 54వ అవతరణ దినోత్సవాన్ని స్థానిక ప్రకాశం భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జేసీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, ఏఎస్పీ నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు సంతోష్, తదితరులు తొలుత జిల్లా జెండాను ఆవిష్కరించారు. ఆంధ్రకేసరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వనరులను వినియోగించుకుంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది నీరు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా జిల్లా రూపురేఖలు మారనున్నాయన్నారు. బెంగళూరు–కడప–విజయవాడ (బీకేవీ) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే జిల్లా నుంచి వెళ్తుండటం మంచి పరిణామమన్నారు. ఈ రహదారిని మరో మూడేళ్లలో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటికే 565, 544(డి), రహదారుల ద్వారా జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లా అభివృద్ధికి యంత్రాంగంతో పాటు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని జేసీ కోరారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందజేసి ఉపాధి మార్గాలు చూపేలా చర్యలు తీసుకుంటున్నామని జేసీ అన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ నాటకాలు, క్రీడలు, సినిమాలు, వ్యాపారాలు, రాజకీయ రంగాలకు జిల్లా పుట్టినిల్లు లాంటిదని అన్నారు. జిల్లాల విభజన అనంతరం ప్రకాశం జిల్లా.. విస్తీర్ణంలో అతిపెద్ద జిల్లాగా ఆవిర్భవించిందన్నారు. అధికార వికేంద్రీకరణతో గ్రామ స్థాయిలో సచివాలయాల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ జిల్లాకు చెందిన విశిష్ట చరిత్ర భావితరాలకు తెలిసేలా మనందరం బాధ్యత వహించాలన్నారు. వేడుకల్లో భాగంగా జిల్లా ఆవిర్భావ చరిత్రపై స్పందన భవనంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో కృషి చేసిన వారిని ఈ సందర్భంగా సత్కరించారు. వీరిలో టంగుటూరు సంతోష్, ప్రముఖ వైద్యులు నల్లూరి రంగారావు, జాతీయ కవి నాగభైరవ కోటేశ్వరరావు సోదరుడు, రచయిత, పరిశోధకుడు నాగభైరవ ఆదినారాయణ, నాటకకర్త పాటిబండ్ల ఆనందరావు, ప్రముఖ గాయకుడు నూకతోటి శరత్‌బాబు ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రైల్వే సర్వీసెస్ ఇంజినీర్ జగదీష్, డీఆర్వో చిన ఓబులేసు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జేసీ అభిషిక్త్‌కిషోర్, మేయర్ గంగాడ సుజాత, తదితరులు

రెండో రోజూ అదే ఊపు



మ్యాచ్‌లో తలపడుతున్న ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ-2, ఇంకొల్లు డీసీఆర్‌ఎం డిగ్రీ కాలేజీ జట్లు

- ఆసక్తికరంగా సాగిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- 46 బౌండరీలు, 10 సిక్సర్లతో మోత మోగించిన క్రీడాకారులు

ఒంగోలు: స్థానిక మినీ స్టేడియంలో బుధవారం ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రెండోరోజైన గురువారం కూడా ఆసక్తికరంగా సాగాయి. మ్యాచ్‌లను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రికెట్ అభిమానులు విచ్చేశారు. 46 బౌండరీలు, 10 సిక్సర్లతో క్రీడాకారులు ఉత్సాహపరిచారు. నిర్ణీత సమయానికే మ్యాచ్‌లను ప్రారంభించగా, మూడు సీనియర్, ఒక జూనియర్ మ్యాచ్‌లను నిర్వహించారు.

తొలి మ్యాచ్ క్విస్–2 కైవసం...

తొలి మ్యాచ్‌లో డీసీఆర్‌ఎం ఇంకొల్లు–ఒంగోలు క్విస్ కాలేజీ–2 జట్లు తలపడ్డాయి. టాస్‌గెలిచిన డీసీఆర్‌ఎం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా క్విస్ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. డీసీఆర్‌ఎం బౌలర్లు అదనపు పరుగులివ్వగా, క్విస్ జట్టు మొత్తం 81 పరుగులు చేసింది. వాటిలో బ్యాట్స్‌మన్ సాధించిన పరుగులు 44 కాగా, మిగిలిన 37 పరుగులు అదనపు పరుగులే కావడం గమనార్హం. 82 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన డీసీఆర్‌ఎం జట్టు 9 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటైంది. పవన్ కళ్యాణ్ అనే క్రీడాకారుడు రెండు బౌండరీలు, రెండు సిక్సర్లతో 19 బంతుల్లో 27 పరుగులు చేయడంతో కొద్దిసేపు ఉత్కంఠ కొనసాగింది. ఇతర క్రీడాకారులు రాణించకపోవడంతో 12 పరుగుల ఆధిక్యంతో క్విస్ జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది.

పేస్ జట్టును వరించిన విజయం...

రెండో మ్యాచ్ ఒంగోలు పేస్ ఇంజినీరింగ్ కాలేజీ–చీరాల సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన సెయింట్ ఆన్స్ జట్టు.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 7 బౌండరీలు, రెండు సిక్సర్లతో 76 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన పేస్ కాలేజీ జట్టు 9 బౌండరీలు, 2 సిక్సర్లతో 9 ఓవర్లలోనే 78 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది.

ట్రిపుల్ ఐటీ జట్టుకు విశేష స్పందన...

మూడో మ్యాచ్ ఒంగోలు హర్షిణీ డిగ్రీ కాలేజీ–ట్రిపుల్ ఐటీ కాలేజీ జట్ల మధ్య జరిగింది. హర్షిణీ కాలేజీ జట్టు 6 బౌండరీలతో 10 ఓవర్లలో 61 పరుగుల వద్ద ఆలౌటైంది. అనంతరం బరిలోకి దిగిన ట్రిపుల్ ఐటీ జట్టు కేవలం ఏడు ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసి జయకేతనం ఎగురవేసింది. ట్రిపుల్ ఐటీ జట్టు 7 బౌండరీలు, ఒక సిక్సర్ కొట్టగా, వాటిలో సంపత్ అనే క్రీడాకారుడు 11 బంతుల్లో 5 బౌండరీలతో 20 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. ఐదు బౌండరీలను వరుసగా ఐదు బంతుల్లో కొట్టడంతో ప్రేక్షకులు చప్పట్లతో హోరెత్తించారు.

జూనియర్స్ తొలి లీగ్ విజేత.. పేస్ డిప్లొమా జట్టు...

జూనియర్స్ విభాగంలో తొలి లీగ్ మ్యాచ్ ఒంగోలు ఏకేవీకే – పేస్ డిప్లొమా కాలేజీ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏకేవీకే జట్టు 10 ఓవర్లలో నాలుగు బౌండరీలతో 8 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. అనంతరం పేస్ డిప్లొమా జట్టు నిర్ణీత ఓవర్లలో 4 బౌండరీలు, ఒక సిక్సర్‌తో ఏడు వికెట్లు కోల్పోయి ఎట్టకేలకు విజయాన్ని కైవసం చేసుకుంది. 9వ ఓవర్లో 11 పరుగులు దక్కించుకున్న పేస్ కాలేజీ జట్టు.. చివరి ఓవర్లో అవసరమైన 5 పరుగులకు చెమటోడ్చక తప్పలేదు. దీంతో చివరి మ్యాచ్ ప్రేక్షకులు, క్రీడాకారుల్లో తీవ్ర ఉత్కంఠను సృష్టించింది.

నేటి మ్యాచ్‌లు...

1. రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ–ప్రకాశం (ఉదయం 8 గంటలకు)
2. ట్రిపుల్ ఐటీ–క్విస్–2 (ఉదయం 10 గంటలకు)
3. పేస్ ఇంజినీరింగ్ కాలేజీ–రైజ్, ప్రకాశం జట్ల మ్యాచ్‌లో విజేతగా నిలిచే జట్టు (మధ్యాహ్నం)



గెలుపొందిన ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ-2 జట్టు



విజేతగా నిలిచిన ఒంగోలు పేస్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు



గెలిచిన ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీ జట్టు



విజయం సాధించిన ఒంగోలు పేస్ పాలిటెక్నిక్ కాలేజీ జట్టు

క్లుప్తంగా

కొలుకులలో పులి సంచారం


పులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీ సిబ్బంది

యర్రగొండపాలెం: మండలంలోని కొలుకుల గ్రామానికి సమీపంలోని చెరువు వద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. ఈ మేరకు గురువారం పులి పాదముద్రలను ఆ శాఖ సిబ్బంది సేకరించారు. గత 10 రోజుల నుంచి పులి చెరువు వద్దకు వచ్చి వెళ్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నీటి కోసం పులి చెరువు వద్దకు వచ్చి వెళ్తోందని, దానిని ఎవరూ చూడలేదని, కేవలం పాదముద్రల ఆధారంగా పులి సంచరిస్తోందన్న భయంతో కొలుకుల ప్రజలు ఆందోళన చెందుతున్నారని కొలుకుల బీట్ సెక్షన్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. రాత్రివేళల్లో నీరు తాగేందుకు చెరువు వద్దకు పులి వచ్చివెళ్తున్నట్లు గుర్తించామని, త్వరలో బీట్ పరిధిలోని సాసర్ పిట్లలో నీరు నింపుతామని పేర్కొన్నారు. బీట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, టైగర్ ట్రాకర్స్ పాల్గొని పులి పాదముద్రలు సేకరించారు.

వాగులో పడి వీఆర్‌ఏ మృతి


చిన్న కాశయ్య మృతదేహం

దర్శి: మండలంలోని రాజంపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ రాచపూడి చిన్న కాశయ్య(43) ముసి వాగు దాటుతూ జారిపడి మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కాశయ్య భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాశయ్య పొదిలి మండలం రాముల వీడు గ్రామానికి వెళ్తూ మార్గమధ్యంలో ఉన్న ముసి వాగు దాటుతుండగా పొరపాటున కాలు జారి ముందుకు పడిపోయి ఊపిరి అందక మరిణించారు. మృతదేహాన్ని వెలికితీయించి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

బైకుల చోరీలో 'పట్టభద్రుడు'

- 8 నెలల్లో 9 బైకులు కాజేసిన వైనం
- చివరికి కటకటాలపాలు

ఒంగోలు టౌన్: అతడి వయసు 21. చదివింది డిగ్రీ. చేస్తున్న పని బైకుల దొంగతనం. పోలీసుల కథనం ప్రకారం.. వెలిగండ్ల మండలం పద్మాపురం గ్రామానికి చెందిన బసిరెడ్డి రవీంద్ర ఒంగోలులోని ఒక ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుకున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. డబ్బు కోసం నగరంలో బైకులను దొంగతనం చేయడం మొదలెట్టాడు. గత 8 నెలల్లో 9 బైకులు దొంగతనం చేశాడు. దీంతో పోలీసులు బైకుల చోరీ మీద ఓ కన్నేశారు. తాలూకా క్రైమ్ పార్టీకి వచ్చిన సమాచారం మేరకు గురువారం స్థానిక మంగమ్మ కాలేజీ దగ్గర రవీంద్రను అదుపులోకి తీసుకొని విచారించారు. తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో 8, ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక బైక్ చోరీ కేసు నమోదై ఉన్నాయి. నిందితుడి నుంచి 9 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన తాలుకా ఎస్సై కె.సురేష్, తాలుకా క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ కె.రామకృష్ణ, కానిస్టేబుల్ కె.రవిని డీఎస్పీ యు.నాగరాజు, తాలుకా సీఐ వి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

భళారే చిత్రం!

- చిత్రలేఖనంలో రాణిస్తున్న ముగ్గురు కంభం వాసులు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు



కంభం: బొమ్మ ఏదైనా సరే వారు కుంచె చేతపడితే అచ్చు గుద్దినట్లు దిగాల్సిందే. కంభం పట్టణానికి చెందిన పఠాన్ ఖాసిం, మోడంపూరి రాజశేఖరరాజు, ఈదర వెంకట్ చిత్రకళలో విశేష ప్రతిభ చాటుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ వద్ద తమకిష్టమైన చిత్రకళలో మెళకువలు నేర్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుంటున్నారు. ఖాసిం చిత్రకళనే జీవనోపాధిగా ఎంచుకోగా, ఈదర వెంకట్ కులవృత్తి అయిన కేశాలంకరణను కొనసాగిస్తూ చిత్రకళలో తన ప్రత్యేకతను చాటుతున్నారు. మోడంపూరి రాజశేఖరరాజు ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తూనే, మరోవైపు చిత్రలేఖనంలో రాణిస్తున్నారు.

ఉపాధ్యాయుడిగా..గాయకుడిగా..



1995లో డ్రాయింగ్ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసిన మోడంపూరి రాజశేఖరరాజు ఓ వైపు విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలు నేర్పిస్తూ మరోవైపు అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొంటూ అవార్డులు అందుకుంటున్నారు. మనుషుల ఫొటోలు గీయడంలో ఈయన సిద్ధహస్తుడు. చిత్రలేఖనంతోపాటు గాయకుడిగా కూడా రాణిస్తూ బహుమతులు పొందుతున్నారు. 2020లో నంద్యాలలో, 2022లో చోడవరంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని రెండు జాతీయ స్థాయి అవార్డులు, 2021, 2022లో అమలాపురంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని రెండు అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఇటీవల జరిగిన పోటీల్లో పాల్గొని 3 బంగారు పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించారు.




వెంకట్ వేసిన చిత్రాలు

కులవృత్తిని కొనసాగిస్తూ..





పట్టణానికి చెందిన ఈదర వెంకట్ 2004లో డ్రాయింగ్ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. ఉద్యోగం రాకపోవడంతో కులవృత్తి అయిన కేశాలంకరణ దుకాణాన్ని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై ఉన్న మక్కువతో గురువు వజ్రగిరి జస్టిస్ వద్ద మరిన్ని మెళకువలు నేర్చుకుని చిత్రలేఖనంలో రాణిస్తూ అవార్డులు పొందుతున్నారు. 2017లో నంద్యాలలో, 2019లో గుంటూరు, తెనాలిలో, 2020లో తిరుపతిలో జరిగిన పోటీల్లో జాతీయ స్థాయి అవార్డులు, 2021లో చొడవరంలో, 2022లో కోనసీమలో జరిగిన పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు.

చిత్రలేఖనమే జీవనోపాధిగా..



1996 నుంచి పఠాన్ ఖాసిం చిత్రకారుడిగా సుపరిచితుడు. అప్పట్లో ఫ్లెక్సీల ప్రభావం లేకపోవడంతో ఎన్నికల సమయంలో, పాఠశాలలు తెరిచే సమయంలో , పండుగలు, నూతన సంవత్సరం సమయంలో మంచి గిరాకీ ఉండేది. లెటరింగ్, వాల్ పెయింటింగ్, నేమ్ బోర్డ్స్, క్లాత్ బ్యానర్స్, బొమ్మలు గీయడంలో ఖాసిం సిద్ధహస్తుడు. జాతీయ నాయకుల చిత్రాలు గీయడంలో మంచి ప్రావీణ్యం ఉంది. కాలక్రమేనా ఫ్లెక్సీలు పెరిగిపోవడంతో పనులు తగ్గిపోయాయని ప్రస్తుతం అడపాదడపా పనులు దొరుకుతున్నాయని ఖాసిం చెబుతున్నాడు. ఓ వైపు పొట్టకూటి కోసం పని చేసుకుంటూనే మరో వైపు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని అవార్డులు అందుకుంటున్నారు. 2017లో నంద్యాలలో, 2019, 2020లో వైజాగ్‌లో, 2021లో తిరుపతి, గుంటూరులో నిర్వహించిన పోటీల్లో పాల్గొని నాలుగు జాతీయ స్థాయి అవార్డులు, 2020లో అమలాపురంలో, 2022లో కోనసీమలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని రెండు అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులు అందుకొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫ్లెక్సీలపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తమకు మళ్లీ పూర్వవైభవం వచ్చి జీవనోపాధి మెరుగుపడుతుందని ఖాసిం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




అంతర్జాతీయ స్థాయిలో అవార్డు పొందిన ఖాసిం చిత్రం



ఖాసిం గీచిన చిత్రాలు

సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ మీదే..

- గృహసారథులతో సమీక్షలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- క్లస్టర్ పరిధిలోని ప్రజలతో మమేకం కావాలని సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న పథకాలు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి అందేలా చూడాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం మార్కాపురం పట్టణంలోని డ్వాక్రా బజారులో భూపతిపల్లి, బోడపాడు, చింతగుంట్ల, గజ్జలకొండ, గోగులదిన్నె, గొట్టిపడియ, ఇడుపూరు, కోలభీమునిపాడు, కొండేపల్లి గ్రామాల గృహసారథుల శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాటాడారు. వలంటీర్లతో కలిసి గృహసారథులు ప్రతి ఇంటిని సందర్శించి పథకాలు అందుతున్నాయో లేదో పరిశీలించాలని చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన నవరత్నాలు పథకాలు చూసి రాష్ట్రంలో ప్రజలు వైఎస్సార్ సీపీ 151 సీట్లు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక జగనన్న 99 శాతం హామీలు నేరవేర్చారన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో గెలుపొందాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ గృహసారథులను నియమించారన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకోవడంతోపాటు కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా పథకాలు వర్తింపజేయాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల వల్ల చాలా మంది అర్హులకు పథకాలు అందలేదని గుర్తు చేశారు.

అభివృద్ధి అంటే ఇదే..

రాష్ట్రంలో గడిచిన 70 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో నాడు–నేడు కింద పాఠశాలలు, వైద్యశాలలు అభివృద్ధి చెందాయని, వందలాది అంబులెన్సులు ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మార్కాపురానికి మెడికల్ కాలేజీ ఒక వరమన్నారు. పట్టణంలో, నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనను జగనన్న పాలనను పోల్చి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణాచెంచిరెడ్డి, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రఫీ, మాజీ ఎంపీపీ పోలయ్య, ఎంపీటీసీ వీరయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అధికారులతో మంత్రి సురేష్ సమీక్ష

పెద్దదోర్నాల: నేషనల్ హైవే అథారిటీ అధికారులతో గురువారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సమావేశమయ్యారు. మండల కేంద్రంలోని వెలుగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో ఆయన అధికారులతో సమావేశమై పనులపై సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. శ్రీశైలం రోడ్డులోని గణపతి చెక్‌పోస్టు నుంచి తొలిదశగా పనులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దీని కోసం సుమారు రూ.220 కోట్లు నిధులు మంజూరయ్యాయని మంత్రి సురేష్‌కు అధికారులు వివరించారు. ఇప్పటి వరకు పెద్దదోర్నాలలో బైపాస్‌కు సంబంధించి మార్కింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను మంత్రి ఆదేశించారు.


నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

దివ్యాంగులకు అండగా జగనన్న

- సంక్షేమ పథకాలతో దివ్యాంగులకు భరోసా
- సెక్షన్ 92తో తమ ఆత్మగౌరవాన్ని కాపాడారు
- వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్
- లోకేష్‌ది కామెడీ యాత్ర అంటూ వ్యంగ్యాస్త్రాలు


వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజు

ఒంగోలు టౌన్: నాయకుల చుట్టూ తిరిగే దుస్థితి నుంచి నాయకత్వం వహించేలా దివ్యాంగులకు సమాన స్థాయి ప్రాధాన్యత కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ పేర్కొన్నారు. పాత జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్‌రాజ్ ప్రసంగిస్తూ.. గతంలో చంద్రబాబు పాలనలో పెన్షన్ల కోసం 1 నుంచి 15వ తేదీ వరకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒకటో తేదీ తెల్లవారుజామునే సూర్యోదయం కంటే ముందే ఇంటి వద్దకు వచ్చి పెన్షన్లు ఇచ్చి పోతున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిన జగనన్న పాలనలో ప్రతి నియోజకవర్గంలోనూ 20 నుంచి 25 మంది దివ్యాంగులు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. సచివాలయాలు, గృహసారథుల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, జగనన్న పెళ్లి కానుక ద్వారా లక్షన్నర రుపాయలను కేటాయించారని, పాదయాత్రలో వందలాది మంది దివ్యాంగులను గుండెలకు హత్తుకున్న జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే వైకల్యంతో సంబంధం లేకుండా వికలాంగులందరికీ పెన్షన్లు మంజూరు చేసి మాట నిలుపుకొన్నారని వివరించారు. 2016 దివ్యాంగుల చట్టంలోని సెక్షన్ 92ను అమల్లోకి తెచ్చి దివ్యాంగుల ఆత్మాభిమానాన్ని నిలిపారని కొనియాడారు. జగనన్న పాలనలో దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోయిందని, 4 లక్షల పెన్షన్లను తొలగించారని దుష్ప్రచారం చేస్తున్నారని, అర్హుల లిస్టు సవరింపు తరువాత మిగిలిన వారందరికీ కూడా పెన్షన్లు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. అడిగితే అన్నం పెట్టేది అమ్మ అయితే.. అడగకుండానే అన్నీ పెట్టేది జగనన్న మాత్రమేనన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు దివ్యాంగులంతా పాటుపడాలని పిలుపునిచ్చారు.

లోకేష్‌ది కామెడీ యాత్ర

టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్‌నాయుడు రాష్ట్రంలో కామెడీ యాత్ర చేస్తున్నారని కిరణ్‌రాజ్ ఎద్దేవా చే శారు. ప్రజల బాధల గురించి ఏమాత్రం అవగాహన లేకుండా కేవలం అధికార దాహంతో పాదయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ తండ్రి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మేలేమిటో చెప్పిన తర్వాతే పాదయాత్ర చేయాలని సూచించారు. చిత్తశుద్ధి లేకుండా చేస్తున్న ఈ పాదయాత్రకు దిశానిర్దేశం లేదన్నారు. ప్రతి మండలంలో దివ్యాంగుల కోసం ఒక కార్యాలయాన్ని నిర్మించాలని, ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కలగజేయాలని పలువురు దివ్యాంగుల సంఘం నాయకులు కోరారు. సభకు యల్లా శివకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. తొలుత చర్చి సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొండరాజు రమణయ్య, మక్కెన సలోచన రాణి, కుమ్మిత వరలక్ష్మీ, కుర్రు జకారియ, యువనేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు బంగారు బాబు, ట్రాన్స్‌జెండర్ నాయకురాలు సాయిశ్రీ, ఎస్‌ఎఫ్‌టీ నాయకులు సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఎం.యోనా, వెంటరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో పట్టపగలే చోరీ

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని వెంకటేశ్వర కాలనీలో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపూజీ కాంప్లెక్స్‌లో కార్పెంటర్‌గా పనిచేసే మక్కెన సైమన్ వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన భార్య విజయలక్ష్మి చేజర్ల గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం పిల్లలను స్కూలుకి పంపించిన అనంతరం దంపతులిద్దరూ ఎప్పటిలాగే విధులకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన సైమన్ మూడు గంటలకు తిరిగి పనికి వెళ్లారు. సాయంత్రం 5 గంటలకు స్కూలు నుంచి వచ్చిన పిల్లలు ఇంటి బయట తలుపులకు వేసి ఉన్న తాళం పగలగొట్టి ఉండటంతో లోపలకు వెళ్లి చూశారు. బీరువా తెరిచి ఉండటంతో వెంటనే తండ్రికి సమాచారం అందించారు. బీరువాలోని రెండు బంగారు చైన్లు(మూడు సవర్లు), 6 చిన్ని బంగారు ఉంగరాలను దొంగలు అపహరించినట్లు గుర్తించిన సైమన్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలుకా సీఐ శ్రీనివాసరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్షన్ సెంటర్లతో రైతులకు గిట్టుబాటు ధర

టంగుటూరు: పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసిందని, ప్రతి రైతు సొంతగా వ్యాపారం చేయాలనేదే తమ ఉద్దేశమని ఉద్యాన వనశాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 945 కలెక్షన్ సెంటర్లు, 34 కోల్డు స్టోరేజీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకు 42 కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 24 కేంద్రాలు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు మల్లవరపు జయరామిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రబాబు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి గోపీచంద్, మండల అధికారి తేజ, ఎఫ్ఈఓలు రవీంద్ర, శేషమ్మ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.